108 అంబులెన్స్‌కు సుస్తీ..

- బాల్కొండలో రెండు నెలలుగా అందని సేవలు
- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందిపడుతున్న ప్రజలు

బాల్కొండ: మండల కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రిలో ఉన్న 108 అంబులెన్స్ సేవలు రెండు నెలలుగా ప్రజలకు అందడం లేదు. దీంతో గత పక్షం రోజుల క్రితం మండల కేంద్రంలో బైక్‌పై నుంచి కింద పడి తీవ్ర గాయాలైన నాగరాజును సకాలంలో ఆస్పత్రికి చేర్చలేక ప్రాణాలు కోల్పోయాడు. అలాగే చిట్టాపూర్ వద్ద జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో ఆర్మూర్ మండలం సుర్బిర్యాల్‌కు చెందిన వ్యక్తి మత్యువాత పడ్డాడు. రెండు నెలలుగా


బాల్కొండ ప్రభుత్వాసుపత్రి ఆవరణలో ఉన్న అంబులెన్స్

108 సేవలు అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఆర్మూర్ నుంచి 108 అంబులెన్స్ వచ్చే లోపు ప్రాణాలు గాల్లో కలిసి పోతున్నాయి. రెండు నెలల క్రితం మండలంలోని ఇత్వార్‌పేట్ వద్ద ఉన్న ఇటుక బట్టీలో కూలీగా చేస్తున్న వ్యక్తి పాము కాటుకు గురయ్యాడు. ఆ వ్యక్తిని బాల్కొండ 108 అంబులెన్స్‌లో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మునిపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదానికి గురై వాహనం దెబ్బతింది. నాటి నుంచి అది అలాగే బాల్కొండ ప్రభుత్వాసుపత్రి ఆవరణలో ఉంది. ఇప్పటి వరకు ఎలాంటి మరమ్మతులు చేపట్టలేదు. దీంతో బాల్కొండ నుంచి మెండోరా మండలం చాకిర్యాల్ నిర్మల్‌జిల్లా సరిహద్దు వరకు 108 అంబులెన్స్ సేవలు లేకుండా పోయాయి. పాలకులు, వైద్యాధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై అంబులెన్స్‌ల నిర్వహణ జిల్లా సూపర్‌వైజర్ రామలింగేశ్వర్‌రెడ్డికి పలుమార్లు ఫోన్‌లో సంప్రదించగా ఆయన స్పందించలేదు.

క్లుప్తంగా

మెరుగైన సేవలందించేందుకు కృషి



బోధన్: విద్యుత్ వినియోగదారులు, రైతులకు మెరుగైన సేవలందించేందుకు కృషి చేస్తున్నామని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక చైర్మన్ నారాయణ అన్నారు. ఎడపల్లి మండల కేంద్రంలోని సబ్ స్టేషన్ ఆవరణలో గురువారం విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి, ఎడపల్లి, బోధన్ రూరల్, రెంజల్ మండలాల పరిధిలోని వినియోగదారుల నుంచి ఫిర్యాదులు, వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. వినియోగదారుల నుంచి నాలుగు దరఖాస్తులు వచ్చాయని, వాటిని సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. వేదిక ప్రతినిధులు సలంద్ర రామకృష్ణ, రాజాగౌడ్, ముక్తార్, ప్రభాకర్, కిషోర్‌కుమార్, పవన్, సాయిబాబా, సత్యనారాయణ, ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీని సద్వినియోగం చేసుకోవాలి

ఆర్మూర్: తెలంగాణ సర్వశిక్షాభియాన్ ఆధ్వర్యంలో అందించే ఉచిత ఫిజియోథెరపీ సేవల ప్రాధాన్యతను గుర్తించి వైకల్యంతో బాధపడే పిల్లల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్మూర్ ఎంఈవో రాజగంగారాం సూచించారు. ఆర్మూర్ పట్టణంలోని భవిత కేంద్రంలో ఉచిత ఫిజియోథెరపీ శిబిరాన్ని గురువారం ప్రారంభించారు. శిబిరంలో ఫిజియోథెరపిస్ట్ అరుణ, ఇన్‌క్లూసివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్స్ కిషన్, సురేశ్, ఎంఐఎస్ కోఆర్డినేటర్ అలేఖ్య, ఆపరేటర్ రఘు, మెసెంజర్ రవి, సీజీవీ కవిత పాల్గొన్నారు.

ఘనంగా స్వామినాథన్ శతజయంతి

పెర్కిట్: ఆర్మూర్ మండలం అంకాపూర్‌లో గురువారం గంగాదేవి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్ శత జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు వినోద్ రెడ్డి స్వామినాథన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రైతులు ఉమా రెడ్డి, నర్సారెడ్డి, దేవేందర్ రెడ్డి, బుజ్జి, జి రాజారెడ్డి, వెంకట్‌రెడ్డి, సచిన్, అనంత్ రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

సోయా పంట పరిశీలన



పెర్కిట్: పెర్కిట్‌లో సాగు చేస్తున్న సోయా చిక్కుడు పంటను మండల వ్యవసాయ అధికారి హరికృష్ణ పరిశీలించారు. పంటలో వేరుకుళ్లు ఆశించినట్లయితే నివారణకు వర్షాలు తగ్గిన తర్వాత లీటరు నీటికి 3 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ మందును కలుపుకుని మొక్క మొదళ్ల తడిచేలా పోయాలన్నారు. ఏఈవోలు రోచన, ఆలేఖ్య, రైతులు పాల్గొన్నారు.

26 రోజుల పని కల్పించాలి

కమ్మర్‌పల్లి: బీడీ కార్మికులకు 26 రోజుల పని కల్పించాలని సాబ్లి వాఫిరే టొబాకో కంపెనీ ఉప్లూర్ శాఖ మేనేజర్‌కు తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ నాయకులు గురువారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో టీయూసీఐ జిల్లా కార్యదర్శి సత్తెక్క, నాయకులు రాజేశ్వర్, కార్మికులు ఉన్నారు.

కార్మికులకు సన్మానం

రుద్రూర్: మండల కేంద్రంలోని చేనేత సహకార సంఘంలో గురువారం జాతీయ చేనేత దినోత్సవం నిర్వహించారు. సంఘంలో పని చేస్తున్న చేనేత కార్మికులను సన్మానించారు. కార్యక్రమంలో చేనేత సంఘం అధ్యక్షుడు మోత్కురి నారాయణ, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ సంపత్ కుమార్, గోనె దత్తాత్రి, గంగుల శంకర్, జువ్వల పోతన్న, శికారి గంగాధర్, చేనేత సంఘం మేనేజర్ నాగరాజు, కార్యదర్శి నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

ఎడపల్లిలో రక్తదాన శిబిరం



బోధన్: మండలంలోని ఏఆర్‌పీ క్యాంప్‌లో కాంగ్రెస్ పార్టీ ఎడపల్లి మండల అధ్యక్షుడు పులి శ్రీనివాస్ జన్మదినం సందర్భంగా అన్నదానం, రక్తదాన శిబిరాలు నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమి చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాంమోహన్, ఈరంటి లింగం, జైతాపూర్ సొసైటీ చైర్మన్ సత్యనారాయణ, నాయకులు బొబ్బిలి శ్రీనివాస్, రవీందర్ రెడ్డి, హన్మంత్‌రెడ్డి పాల్గొన్నారు.

నులిపురుగు నివారణపై అవగాహన సదస్సు


వేల్పూర్‌లో మాట్లాడుతున్న వైద్యాధికారి


బాల్కొండలో మాట్లాడుతున్న వైద్యాధికారిణి

వేల్పూర్/ బాల్కొండ/ పెర్కిట్/ రుద్రూర్/ బోధన్/ బోధన్‌రూరల్: వేల్పూర్ పీహెచ్‌సీలో గురువారం నులిపురుగుల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈనెల 11న నిర్వహించే నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైద్యాధికారి శరత్‌చంద్ర పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల గ్రామాల ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు. బాల్కొండ మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో కిసాన్‌నగర్ పీహెచ్‌సీ వైద్యాధికారిణి, ఎంఈవో రాజేశ్వర్, సీఆర్పీలు, హెచ్‌ఈవో వేణుగోపాల్ పాల్గొన్నారు. ఆలూర్ మండల కేంద్రంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులకు ఎంఈవో నరేందర్ నులి పురుగుల దినోత్సవంపై అవగాహన కల్పించారు. అలాగే పెర్కిట్ తెలుగు మీడియం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఈ సంద ర్భంగా ర్యాలీ నిర్వహించారు. హెచ్‌ఎం శ్రీనివాస్, పీడీ గటడి రాజేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. రుద్రూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నులి పురుగుల నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వై ద్యురాలు అయేషా సిద్ధిఖా, ఎంఈవో కట్ట శ్రీనివా స్, హెల్త్ సూపర్‌వైజర్ రవి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీలత, మణి, సిబ్బంది పాల్గొన్నారు. సాలూర, ఎడపల్లి, బోధన్ మండల కేంద్రాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ, సమావేశాలు నిర్వహించారు. సాలూరలో నిర్వహించిన కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి సురేశ్ కుమార్, ఎంపీడీవో శ్రీనివాస్, వైద్యుడు రాజ్‌కుమార్, ఎడపల్లిలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వినీత్‌కుమార్ రెడ్డి, ఆయుష్ విభాగం వైద్యుడు వెంకటేశ్, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు. బోధన్‌లో ఎంఈవో నాగయ్య, డాక్టర్లు అంబిక, విఠల్, ఎంపీవో మధుకర్, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన



వేల్పూర్: మండలంలోని అంక్సాపూర్ ఉన్నత పాఠశాలలో గురువారం మోడల్ ఎన్నికలు నిర్వహించి విద్యార్థులకు ఓటు హక్కుపై ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. ఎన్నికల్లో పోటీచేసే విధానం, పోలింగ్ బూత్‌లలో ఏయే అధికారి ఎలాంటి విధులు నిర్వహిస్తారో తెలిపారు. విద్యార్థులు అధికారులుగా మారి తమ విధులు నిర్వహించారు. హెచ్‌ఎం మల్లీశ్వరి, ఉపాధ్యాయు లు సదాశివ్, వినోద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హిందువులు ఐక్యంగా ఉండాలి

మాక్లూర్: హిందువుల ఐక్యత.. దేశానికి శ్రీరామ రక్ష అని బీజేపీ జిల్లా కార్యదర్శి గంగోనే సంతోష్ అన్నారు. మాక్లూర్ మండలం మాణిక్‌బండార్‌లో పార్టీ మండల అధ్యక్షురాలు మమతరాజేశ్వర్‌తో కలిసి బీజేపీ ఇంటింటా కార్యక్రమం చేపట్టారు. అనంతరం బీజేపీ కరపత్రాలను పంచిపెట్టారు. నాయకులు శివలాల్, చింత ప్రవీణ్‌రెడ్డి, రాజేశ్వర్, నరేందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు స్పాట్ అడ్మిషన్లు

నందిపేట్: మండల కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మిగిలిన సీట్ల కోసం శుక్రవారం స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రాజ్ కుమార్ గురువారం తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పాలిసెట్ ఉత్తీర్ణులైన వారికి ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. మెరిట్ ఆధారంగా అడ్మిషన్ల ప్రక్రియ ఉంటుందన్నారు.

నేటి చిత్రం



చెత్తను తొలగించండి

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని 27వ వార్డులో ఉన్న హనుమాన్ ఆలయం ప్రహరీకి ఆనుకొని ఉన్న చెత్తను తొలగించడంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. చెత్తను తొలగించాలని అధికారులకు విన్నవించినా స్పందించడం లేదు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి చెత్తను తొలగించాలి. – పవన్, రాజారాంనగర్, ఆర్మూర్

మాకు ఫొటో పంపండి
మీ ప్రాంతంలో నెలకొన్న సమస్యను, ఫొటోను మాకు వాట్సాప్‌లో పంపించండి. ప్రచురించి అధికారుల దృష్టికి తీసుకెళ్తాము. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాము.

ఆర్మూర్ : 90102 44405 | బాల్కొండ : 96666 49049 | బోధన్ : 99636 95349

హిందూ ధర్మ పరిరక్షణకు పాటుపడాలి


ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి

మాక్లూర్: ప్రతిఒక్కరూ హిందూ ధర్మ పరిరక్షణకు పాటుపడాలని ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి అన్నారు. మాక్లూర్ మండలం కృష్ణనగర్ రామాలయంలో గురువారం నిర్వహించిన ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. నేటి సమాజంలో ప్రతి ఒక్కరిలో సేవాభావం, ఆధ్యాత్మికత అవసరమని అన్నారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు వాసుదేవరావు, డి రమేశ్‌నాయక్, నర్సింగ్‌రావు, పార్టీ మండల అధ్యక్షురాలు మమత రాజేశ్వర్, సీనియర్ నాయకులు గోవూరు ఒడ్డెన్న, అనిల్ కులకర్ణి, మండల మాజీ అధ్యక్షుడు సురేశ్‌నాయక్, చింత ప్రవీణ్‌రెడ్డి, చిన్నాపూర్ వినోద్, రాజేశ్వర్, రమేశ్, శివలాల్, రాజు పాల్గొన్నారు.

అభివృద్ధిలో పార్లమెంట్ సెగ్మెంట్‌పై వివక్ష ఎందుకు..?

- ఎంపీ అర్వింద్‌ను ప్రశ్నించిన ఏఐసీసీ ప్రచార కమిటీ సభ్యుడు కోల వెంకటేశ్


సమావేశంలో మాట్లాడుతున్న కోల వెంకటేశ్

ఆర్మూర్: రెండు పర్యాయాలు ఎంపీగా గెలిచినా నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో అభివృద్ధికి నిధుల మంజూరు, కేటాయింపుపై వివక్ష ఎందుకని ఏఐసీసీ ప్రచార కమిటీ సభ్యుడు కోల వెంకటేశ్ ఎంపీ ధర్మపురి అర్వింద్‌ను ప్రశ్నించారు. ఆర్మూర్ పట్టణంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిజామాబాద్ నుంచి జగదల్‌పూర్ వరకు ఉన్న 63వ నంబర్ జాతీయ రహదారి విస్తరణకు నిధులు మంజూరైనా పనులు ప్రారంభించకపోవడం ఎంపీ నిర్లక్ష్య ధోరణికి నిదర్శనమన్నారు. ఆర్మూర్ మండలం అంకాపూర్ శివారు నుంచి నేరుగా జాతీయ రహదారిని కలుపుతూ బైపాస్ రోడ్డు నిర్మాణం చేపట్టాలన్నారు. ఆర్మూర్ మీదుగా ఆదిలాబాద్ రైల్వే లైనును వేరే లైన్లతో సంబంధం లేకుండా పూర్తి చేయాలనీ డిమాండ్ చేశారు. వ్యవసాయ ఉత్పత్తులు ఎగుమతి చేసేలా డ్రైపోర్ట్ మంజూరయ్యేలా చూడాలని కోరారు. సమావేశంలో నాయకులు దేశెట్టి నీరజ్, పట్టణ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు బట్టు శంకర్, మీసాల రవి, ప్రధాన కార్యదర్శులు చిలవేరి శ్రీకాంత్, షేక్ పాషా, కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు బాల కిషన్, పెద్ద పోశెట్టి, పింజ గంగాధర్, సుదర్శన్ గౌడ్, యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ కళ్యాణ్ కర్ దినేశ్, ప్రధాన కార్యదర్శులు భరత్ గౌడ్, అబ్దుల్ వాసి, రాజు కుమార్ గౌడ్, గోగికర్ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

లక్కోరలో రోడ్డు ఆక్రమణ


లక్కోరలో జీపీ నిర్మించిన రోడ్డును ఆక్రమించి మొరం పోసిన దృశం

వేల్పూర్: వేల్పూర్ మండలం లక్కోర గ్రామంలోని పదోవార్డులో జీపీ నిర్మించిన సీసీరోడ్డును ఓ గ్రామస్తుడు గురువారం మొరం పోసి ఆక్రమించారని గ్రామస్తులు ఆరోపించారు. గతంలో ఇక్కడ బీసీలకు ప్రభుత్వం ప్లాట్లు కేటాయించింది. బావి భాగాన్ని రోడ్డుకు వదిలివేసినట్లు తెలిపారు. అందులో 2022 వేసవిలో జీపీ తరఫున రూ. 5 లక్షలతో సీసీరోడ్డు నిర్మించారు. బావి భాగం తాను కొనుగోలు చేశానని, రిజిస్ట్రేషన్ డాక్యుమెంటు కూడా ఉందని గ్రామస్తుడు అడ్డుకునే ప్రయత్నం చేశారు. రెవెన్యూ అధికారులు జారీ చేసిన పట్టా పత్రాలలో రోడ్డును చూపించడం వల్లనే రోడ్డు నిర్మిస్తున్నట్లు అప్పట్లో జీపీ తరఫున స్పష్టం చేశారు. తిరిగి పాత పత్రాలనే చూపిస్తూ తమ భూమి అంటూ సుమారు 80 మీటర్ల మేరకు ఉన్న సీసీరోడ్డుపై మట్టిపోశారని గ్రామస్తులు పేర్కొన్నారు. ఈ విషయమై జీపీ కార్యదర్శి విజయ్‌కుమార్‌ను సంప్రదించగా మట్టిపోసింది వాస్తవమేనని, దానిపై చర్యకోసం పోలీసులకు, మండల పరిషత్ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి



కమ్మర్‌పల్లి: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని ఎంపీడీవో రాజశ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య సభ్యులకు ఎంపీడీవో మొక్కలను గురువారం పంపిణీ చేశారు. నాయకులు రవి, బుచ్చిమల్లయ్య, సింగిరెడ్డి శేఖర్, సల్లూరి గణేష్‌గౌడ్ పాల్గొన్నారు.

రహదారిపై విరిగిన చెట్టుకొమ్మ


జాన్కంపేట్ శివారులో రహదారిపై విరిగిపోయిన చెట్టుకొమ్మ

వేల్పూర్: వేల్పూర్ మండలం జాన్కంపేట్ రెవెన్యూ శివారులో ఆర్మూర్, భీమ్‌గల్ ఆర్‌అండ్‌బీ రహదారిపై బుధవారం రాత్రి విరిగిపోయిన చెట్టు కొమ్మను అధికారులు తొలగించకపోవడంతో వాహనాల రాకపోకలకు ఆటంకం ఏర్పడింది. బుధవారం రాత్రి వీచిన బలమైన గాలులకు గోవింద్‌పేట్ దాటిన తర్వాత తుమ్మచెట్టు కొమ్మ విరిగి రోడ్డుపై వంగింది. దీంతో ఒక పక్క నుంచి వాహనాలు దాటుకుంటూ ఆర్మూర్, భీమ్‌గల్ వైపు వెళ్తున్నాయి. దీనికి తోడు మరోచోట చెట్టుకొమ్మ విరిగిపడడంతో ప్రయాణికులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేష్టం


నందిపేటలో మాట్లాడుతున్న పీహెచ్‌ఎన్ పద్మ

నందిపేట్: తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేష్టమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేఖ, పీహెచ్‌ఎన్ పద్మ అన్నారు. నందిపేట మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అప్పుడే పుట్టిన బిడ్డకు ముర్రుపాలు పట్టాలని అన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ భాస్కర్, అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బోధన్ సీడీపీవో పద్మ

కోటగిరిలో..
రుద్రూర్: కోటగిరి మండల కేంద్రంలోని జరినా కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం, గర్భిణులకు సీమంతం చేపట్టారు. కార్యక్రమంలో బోధన్ సీడీపీవో పద్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు కొమురవ్వ, గోపి లక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు విజయ లక్ష్మి, జమున, సావిత్రి, కృష్ణకుమారి, సావిత్రి, ఏఎన్‌ఎం మంజుల, ఆశావర్కర్లు, గర్భిణులు పాల్గొన్నారు.

విత్తనోత్పత్తి ప్రక్రియ విస్తృతం చేయాలి



రుద్రూర్: కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో చేపడుతున్న విత్తనోత్పత్తి, రైతులకు అందించే సేవలను విస్తృతం చేయాలని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు యాకాద్రి సూచించారు. రుద్రూర్ కేవీకె కార్యాలయంతోపాటు కోటగిరి మండలం ఎత్తొండ, పోతంగల్ మండలం హెగ్డోలి గ్రామాల్లో చేపడుతున్న క్షేత్రస్థాయి ప్రదర్శన క్షేత్రాలను గురువారం ఆయన సందర్శించారు. పంటలో చీడపీడల నివారణ కోసం రైతులు చేపడుతున్న చర్యలను పరిశీలించారు. శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు ఏ మేరకు ఉపయోగపడతున్నాయని రైతుల అభిప్రాయాలను సేకరించారు. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు ఇందూధర్ రెడ్డి, శ్వేత, విజయ్ కుమార్, ఏఈవో శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో రాఖీ వేడుకలు



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలోని ప్రభుత్వ బాలుర పాఠశాలలో గురువారం రాఖీ పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం లక్ష్మీనర్సయ్య, ఉపాధ్యాయులు గజేందర్, శ్రీనివాస్, విజయభారతి పాల్గొన్నారు. ఆర్మూర్ కోర్టులో న్యాయవాదుల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రక్షాబంధన్ వేడుకలు నిర్వహించారు. సీనియర్ న్యాయవాది లోక భూపతిరెడ్డి, న్యాయవాదుల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జక్కుల శ్రీధర్, ప్రధానకార్యదర్శి జెస్సు అనిల్, కోశాధికారి గజ్జల చైతన్య న్యాయవాదులు పాల్గొన్నారు.
బాల్కొండ: బాల్కొండ, ముప్కాల్, మెండోరా మండలాల పరిధిలోని ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల్లో రాఖీ పండుగ నిర్వహించారు. కార్యక్రమాల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ దరఖాస్తులను పరిష్కరించాలి


రికార్డులను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ వికాస్

బోధన్: భూభారతి రెవెన్యూ సదస్సుల్లో స్వీకరించిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా పరిష్కార చర్యలు తీసుకోవాలని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో అధికారులను ఆదేశించారు. గురువారం ఎడపల్లి మండల తహసిల్ కార్యాలయాన్ని పరిశీలించారు. రెవెన్యూ సదస్సుల దరఖాస్తుల పరిష్కార పురోగతిపై మండల రెవెన్యూ అధికారులు, ఉద్యోగులతో సమీక్షించారు. భూసంబంధిత సమస్యలపై వచ్చిన దరఖాస్తులను జవాబుదారిగా పరిష్కరించాలన్నారు. తహసీల్దార్ దత్తాద్రి, ఉద్యోగులు పాల్గొన్నారు.

విచారణ వేగవంతం చేయాలి


రికార్డులను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ అభిజ్ఞాన్

బాల్కొండ: భూభారతి దరఖాస్తుల విచారణ వేగవంతం చేయాలని ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిజ్ఞాన్ మాల్వియా అన్నారు. గురువారం బాల్కొండ తహసీల్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులు, పరిష్కరించిన వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. భూ సమస్యల పరి ష్కారం కోసం ప్రభుత్వం తీసుకొచ్చిన భూభా రతి చట్టాన్ని పకడ్బందీగా నిర్వహించాలన్నా రు. తహసీల్దార్ శ్రీధర్, సిబ్బంది ఉన్నారు.

సంక్షిప్తం

ఏసీపీ కార్యాలయం ఎదుట ధర్నా



ఆర్మూర్‌టౌన్: సుర్బిర్యాల్‌లో మాదిగలను కుల బహిష్కరణ చేయడాన్ని నిరసిస్తూ ఎమ్మార్పీఎస్ నాయకులు పట్టణంలోని ఏసీపీ కార్యాలయం ఎదుట గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వీడీసీ చర్యలు తీసుకోవాలంటు నియోజకవర్గ ఇన్‌చార్జి మైలారం బాలు, నాయకులు ఏసీపీకి వినతిపత్రం అందజేశారు. వీడీసీపై చర్యలు తీసుకోకుంటే కలెక్టరేట్ ఎదుట చావు డప్పుల కార్యక్రమాన్ని చేపడతామని నాయకులు అన్నారు. అనంతరం ఏసీపీ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. నాయకులు మల్కన్న, సంజయ్, వినోద్, సుధాకర్, గాంధీ, గంగాధర్, నాగయ్య, షక్కరయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో వన మహోత్సవం

పెర్కిట్: పెర్కిట్ తెలుగు మీడియం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం వన మహోత్సవం కార్యక్రమం నిర్వహించారు. హెచ్ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసి మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటరమణ చారి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దుస్తుల పంపిణీ

బాల్కొండ: ముప్కాల్ మండలం రెంజర్ల ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేసిన దుస్తులను గురువారం ఐకేపీ సీసీ స్వరూప పంపిణీ చేశారు. కార్యక్రమంలో వీవోఏలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలి

బోధన్: పట్టణంలోని ఆచన్‌పల్లిలో ఉన్న సాలూర మహాత్మా జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలను గురువారం సాలూర మండల ప్రత్యేక అధికారి సురేశ్ కుమార్, ఎంపీడీవో శ్రీనివాస్ ఆకస్మికంగా పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థినులకు పౌష్టికాహారం అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం సాలూర మండలంలోని కుమ్మన్‌పల్లిలో అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్‌రూం ఇళ్లను పరిశీలించారు. సాలూర మండల ఎంపీడీవో ఆఫీస్‌ను సందర్శించి ప్రజాపాలన సేవా కేంద్రం పనితీరును పర్యవేక్షించారు.

ఎల్‌వోసీ అందజేత

బాల్కొండ: ముప్కాల్ మండలం వేంపల్లికి చెందిన బొత్తమొల్ల రాములు కిడ్నీ సంబంధిత వ్యాధితో నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. స్థానిక నాయకులు టీఎస్ ఎండీసీ చైర్మన్ ఈరవత్రి అనిల్ దృష్టికి తీసుకెళ్లడంతో వైద్య ఖర్చుల కోసం రూ.2.25 లక్షల ఎల్‌వోసీని అనిల్ మంజూరు చేయించారు. ఎల్‌వోసీ ప్రతిని బాధిత కుటుంబ సభ్యులకు గురువారం అందజేశారు. ఎల్‌వోసీ మంజూరుకు కృషి చేసిన అనిల్‌కు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

జూనియర్ కళాశాల తనిఖీ

బాల్కొండ: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఇంటర్మీడియట్ బోర్డు ప్రత్యేకాధికారి ఒడ్డెన్న డీఐఈవో రవికుమర్‌తో కలిసి గురువారం తనిఖీ చేశారు. విద్యార్థుల అడ్మిషన్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రిన్సిపాల్ రజీయొద్దీన్, అధ్యాపకులు ఉన్నారు.